క్లుప్తంగా

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుధాకర్ నాయక్



గార్ల: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గార్లలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న జర్పుల సుధాకర్ నాయక్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం



మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పదో తరగతి విద్యార్థుల స్నాక్స్ కోసం రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్ బాబు, పూర్వ విద్యార్థులు కృష్ణయ్య, వెంకటరెడ్డి, యాకయ్య, రమేశ్, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి విష్ణువర్ధన్, సోహెన్ కాసం శ్రీనివాసరావు, తిరుపతి పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు డైరెక్టర్‌ను కలిసిన దైద వెంకన్న

నెహ్రూసెంటర్: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ వి.పి.గౌతమ్‌ను మంగళవారం హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

ఉద్యోగి మృతి బాధాకరం



నెహ్రూసెంటర్: నిర్మల్ జిల్లాలో వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి భరత్ మృతి బాధాకరమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మురళీధర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి మౌనం పాటించారు.

అభినందనలు

నర్సింహులపేట: హైదరాబాద్‌లో జరిగిన సీనియర్ సిటిజన్ చాంపియన్ షిప్‌లో 65ఏళ్లు దాటిన పురుషుల విభాగంలో నిర్వహించిన రన్నింగ్‌లో నర్సింహులపేటకు చెందిన సమ్మెట సమ్మయ్యగౌడ్ తృతీయ బహుమతిని గెలుచుకున్నాడు. మంగళవారం తహసీల్దార్ చప్పిడి నాగరాజు, డీటీ సంజీవ, ఎస్సై మాలోతు సురేశ్ శాలువాతో సత్కరించి అభినందించారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజారవాణాల్లో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జరిగే చలో బస్సు భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు సూర్యం, యాకయ్య, సత్యం, రంగయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



కేసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు పలు రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్‌శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేసి, పోలీస్‌స్టేషన్ రిసెప్షన్‌లో సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, రౌడీషీటర్ల వివరాలను ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు, ఎఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వేతనాలు రాక వెతలు

- మూడు నెలలుగా పెండింగ్‌లో..
- ఇబ్బంది పడుతున్న చైల్డ్‌లైన్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు
- కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన

మహబూబాబాద్: బాలల పరిరక్షణ అధికారుల, చైల్డ్‌లైన్ ఉద్యోగుల వేతనాలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వేతనాల పెండింగ్‌తో ఇబ్బందులు పడుతున్నామని కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలనీ వేతనాలు, అపై పెండింగ్‌తో అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. వేతనాల పెండింగ్‌పై సంబంధిత ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విడుదలకు కృషి చేయాలని కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలోని బాల రక్షాభవన్

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలరక్షా భవన్‌ను నిర్వహిస్తున్నారు. 2011నుంచి సమీకృత బాలల పథకం అమలులోకి వచ్చింది. ఆ పథకంలోనే బాలల పరిరక్షణ విభాగం ఏర్పాటు చేశారు. ఈ పథకం పిల్లల న్యాయ చట్టం ప్రకారం పని చేస్తుంది. బాలరక్షా భవన్‌లో బాలల పరిరక్షణ విభాగం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. చైల్డ్ లైన్ 1098ను కూడా బాలల పరిరక్షణ విభాగంలోనే కలిపారు. సమీకృత బాలల పరిరక్షణ స్కీంకు రాష్ట్ర ప్రభుత్వం 40శాతం, కేంద్రం 60శాతం బడ్జెట్ కేటాయిస్తుంది. చైల్డ్‌లైన్‌లో జిల్లాలో 8మంది, బాలల పరిరక్షణ అధికారులు 12మంది కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వరిస్తున్నారు. చైల్డ్‌లైన్ ఉద్యోగులకు నెలకు రూ.18వేలు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు నెలకు రూ.28వేలు ఇస్తున్నారు.

వెంటనే వేతనాలు విడుదల చేయాలి

మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిధుల విడుదల కోసం ప్రత్యేక చొరువ చూపాలని వేడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాటమయ్య రక్షణ కవచాలు ఇవ్వాలి

- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

నెహ్రూసెంటర్: వృత్తిలో ప్రమాదాల నివారణకు కల్లుగీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచాలు ఇవ్వాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో కేజీకేఎస్ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పదివేల మందికి మాత్రమే రక్షణ కవచాలు అందజేశారని, మిగిలిన వారికి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న, మోహన్, మోడెం వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరమణ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్ యూటీఎఫ్ కార్యదర్శి యాకూబ్

కురవి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల ఆఫీసర్ బేరర్స్ సమావేశం పి.మంజుల అధ్యక్షతన కురవిలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం సంవత్సరం దాటినా ఒక్కటి కూడా పరిష్కరించలేదని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, శైలజ, వీరన్న, బాలరాజు, బాబు, సురేష్, రమ్య, ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాకూబ్

మున్సిపల్ ఎన్నికల్లో అవకాశం ఇవ్వండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

నెహ్రూసెంటర్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాసమస్యలపై పోరాడే సీపీఐ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కోరారు. సీపీఐ 19వ వార్డు ఎన్నికల సన్నాహక సమావేశం చిదిరాల జ్ఞానేశ్వర్ అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజల మద్దతు ఇవ్వాలని కోరారు. మానుకోట మున్సిపల్ చైర్మన్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, కేదాసు రమేష్, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయసారథి

వైద్యసిబ్బందిని నియమించాలి

గార్ల: మండలంలోని పినిరెడ్డిగూడెం పల్లె దవాఖానాలో వైద్యుడు, వైద్యసిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో దవాఖానా ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ ధర్నాలో మండల కార్యదర్శి అలువాల సత్యవతి, పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి, కొండయ్య పాల్గొన్నారు.

14న లోక్ అదాలత్

నెల్లికుదురు: రాజీపడటమే రాజమార్గమని ఎస్సై చిర్ర రమేశ్‌బాబు కక్షిదారులకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 14న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం చూపిస్తున్న ఎస్సై

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న 25క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. పెద్దనాగారం పరిధిలో రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వాహనంను తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరిని అదుపులో తీసుకొని వెంటనే పీఎస్‌కు తరలించారు. బియ్యంను తరలిస్తున్న మూడ్ నరేష్, జాటోత్ సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ హాస్టల్, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై జిల్లా పోలీస్ బృందం ప్రత్యేక నిఘా పెట్టామని షీ టీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాలు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని, విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటుపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైన ఆకతాయిలు నుంచి ఇబ్బందులు ఎదురైతే షీ టీం నంబర్ 87126 86056కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై భీమారెడ్డి, హెచ్‌ఎం సిరినాయక్, న్యాయవాది, సావిత్ర, ఉపాధ్యాయులు వవాసేదేవ్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- జెడ్పీ సీఈఓ పురుషోత్తం

మహబూబాబాద్ రూరల్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ సీఈఓ డి.పురుషోత్తం అన్నారు. సీఎం కప్ క్రీడల నిర్వహణలో భాగంగా మహబూబాబాద్ మండలస్థాయి క్రీడా పోటీలు మంగళవారం రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, హెచ్‌ఎం సక్రు, పీడీలు ధరావత్ మోహన్ నాయక్, అవారి శ్రీనివాస్, మంకాలి వెంకటేశ్వర్లు, పీఈటీ ఇస్మాయిల్, పాల్గొన్నారు. మహబూబాబాద్ మండలంలో సంగ్రాలగూడెం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కేసముద్రం: ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ క్రాంతి అన్నారు. మంగళవారం కేసముద్రంవిలేజ్‌లోని జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో మండలస్థాయి సీఎం కప్ క్రీడలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ కాలేరు యాదగిరి, ఎంపీఓ హరిప్రసాద్, హెచ్‌ఎం వెంకట్రామనర్సయ్య, వెంకట్‌రెడ్డి, పీడీలు పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో మంగళవారం సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి, తహసీల్దారు కృష్ణవేణి, సీఐ బి.రాజేష్, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, ఎంఈఓ ఆంగోత్ లక్ష్మా, మున్సిపల్ కమిషన్ వెంకటస్వామి పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న అధికారి పురుషోత్తం

గూడూరు: సీఎం కప్ క్రీడోత్సవాలను మంగళవారం ఎంపీడీఓ వీరస్వామి, సీఐ బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సదాశివ, ఉపాధ్యాయుడు భిక్షపతి పాల్గొన్నారు.

పెద్దవంగర: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుమాధవ్ ఎస్సై కాంత్రి కిరణ్, పీఈటీ ప్రభాకర్ పాల్గొన్నారు.

మరిపెడ: మరిపెడ జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి సీఎం కప్ క్రీడలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి , జిల్లా స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, ఎంఈఓ అనితాదేవి, హెచ్‌ఎం అనంతరాములు పాల్గొన్నారు.

రేపు శ్లోకాల కంఠస్థ పోటీలు

మహబూబాబాద్ రూరల్ : తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీ గురువారం వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీమద్భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి, ఇమ్మడి రవికుమార్, రూపిరెడ్డి శ్రీలత మంగళవారం తెలిపారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల అనంతరం విజేతలకు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

ఆశకార్యకర్తల ముందస్తు అరెస్ట్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర కమిటీ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఆశ కార్యకర్తలను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

– మహబూబాబాద్ రూరల్/కేసముద్రం/గార్ల/నర్సింహులపేట/డోర్నకల్/కురవి/చిన్నవంగర



మహబూబాబాద్ రూరల్: పోలీస్‌స్టేషన్‌లో ఆశకార్యకర్తలు



డోర్నకల్: పోలీసుల అదుపులో ఆశకార్యకర్తలు



గార్ల: ఆశవర్కర్ల రాస్తారోకో..



కురవి పోలీసులు అదుపులో..



కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో..

సంక్షిప్త సమాచారం

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



తొర్రూరు రూరల్: దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని గుర్తూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి తనిఖీ చేశారు. రైతులు ధాన్యాన్ని తాలు లేకుండా తీసుకురావాలని, తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు సోమరాజశేఖర్, ఇట్టె శ్యామ్ సుందర్‌రెడ్డి, బిజ్జాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో రాస్తారోకో

కేసముద్రం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ పూర్తిగా చేసి, రైతుబంధు వేయాలంటూ ఇనుగుర్తి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చంద్రయ్య, సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

బయ్యారం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను మంగళవారం బయ్యారంలో దివ్యాంగుల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు రాంబాబు, గోపాల్, వెంకటేశ్వర్లు, సహదేవ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మరిపెడ: మున్సిపాలిటీలో పేరుకపోయిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల నాయకుడు బానాల రాజన్న ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో మహిళ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొంతు మమత, కొక్కు శ్రీదేవి, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

దంతాలపల్లి: ఎమ్మెల్యే రామచంద్రునాయక్ అసెంబ్లీలో చేసిన ప్రసంగాన్ని కొంతమంది ఉద్దేశ పూర్వకంగా వక్రీకరించారని కాంగ్రెస్ నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పిల్లల రాజుకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మాటలను తప్పుగా ప్రచారం చేసిన వారిపై కఠిన చర్య తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ బట్టునాయక్, సాదు లింగారెడ్డి, సుబోయిన వెంకన్న, కొత్త కోమురవెల్లి, సురేష్ పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

దంతాలపల్లి: మండలంలోని ఆగపేట గ్రామంలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రభోత సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి తొర్రూరు అధ్యక్షుడు సుధాకర్, సభ్యులు జమ్ముల యాకయ్య, శ్రీనివాస్, ఉమ, హారతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ సమస్యలపై మంగళవారం సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, జలేందర్, ఎల్లయ్య, సావిత్ర పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

దంతాలపల్లి: విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌తో విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని దాట్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. బాలిక శిశు విద్యావిషయక్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలు

నెల్లికుదురు: విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో నెలకొన్న సమస్యలను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో అశోక్, రాము, అనిల్, రంజిత్ పాల్గొన్నారు.

బోనస్ నగదు జమ

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలోని శ్రీసాయి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం విక్రయించిన రైతు ఖాతాలో ప్రభుత్వ ధరకు సంబంధించిన నగదుతోపాటు బోనస్ నగదు జమ అయింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతాపం

గార్ల: గార్లలో పనిచేస్తున్న హమాలీ కార్మికుడు ఈర్ల శ్రీను(50) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి అలువాల సత్యవతి, అంబటి వీరస్వామి, మల్లయ్య, తదితరులు మృత దేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నెహ్రూసెంటర్: మానుకోటలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎండి.ఫరీద్, నాయకులు తేళ్ల శ్రీనివాస్, ముత్యం వెంకన్న, కత్తుల ఎలేందర్, డొలగర్ శంకర్, రామరాజు యాకన్న, గుగులోత్ రామచంద్రు, మల్లం వంశీ తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణా తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, కత్తెరసాల విద్యాసాగర్ పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మైదం దేవేందర్, బండి రమేష్, మిర్యాల వెంకన్న, జగదీశ్వర్ పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కురవి/దంతాలపల్లి/బయ్యారం/కొత్తగూడ/పెద్దవంగర: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చినందుకు నిరసనగా మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తోటలాలయ్య, నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, బాదావత్ రాజునాయక్, మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, గుడిపూడి నవీన్, మున్సిపల్ చైర్మన్ సింధూర, సత్యనారాయణ, మండల అధ్యక్షులు కొమ్మనబోయిన వేణు, ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, నాయకులు పాల్గొన్నారు.



మరిపెడ: పాలాభిషేకం చేస్తున్న రెడ్యానాయక్

మెడికల్ స్టోర్‌లో చోరీ

మహబూబాబాద్ రూరల్: ఓ మెడికల్ స్టోర్‌లో చోరీ జరుగగా షాపు ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరా దొంగను పట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలో శ్రీకాంత్ మెడికల్ స్టోర్ నిర్వాహకుడు చిర్రగోని శ్రీకాంత్ రోజుమాదిరిగానే సోమవారం రాత్రి తన షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి షాపు తెరుద్దామని చూడగా చిన్న షెట్టరు ధ్వంసం చేసి తొలగించి కనిపించింది. రూ.20 వేలు నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ, బ్లూకోల్ట్స్ పీసీలు సక్రాం, వీరన్న ఘటన స్థలానికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించి దొంగను గుర్తించి గంట సమయంలోగా అదుపులోకి తీసుకున్నారు వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దౌలత్ నగర్ ప్రాంతానికి చెందిన బానోత్ దస్రుగా గుర్తించి కేసు నమోదు చేశారు. అతడి వద్ద ఉన్న రూ.6 వేల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

కురవి: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, యువతకు ఉద్యోగ కల్పన చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ధరలు తగ్గించి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, తురక రమేశ్, కురియాల వీరన్న, మల్లమ్మ, వెంకటమ్మ, నాగమణి, పద్మ పాల్గొన్నారు.